సాక్షి ఖమ్మం

మంగళవారం । 10 । జనవరి । 2023



మిర్చి, పత్తితో మార్కెట్ కళకళ
ధర పుంజుకుంటున్న నేపథ్యాన రైతులు మిర్చి, పత్తి అమ్మకానికి మొగ్గు చూపుతుండడంతో మార్కెట్ కళకళలాడుతోంది. 10లో



మహా ప్రసాదం
'ప్రసాద్' పథకం ద్వారా రూ.41కోట్లతో చేపట్టే పనులతో భద్రాద్రి, పర్ణశాలలో మెరుగైన సౌకర్యాలు అందుబాటులో రానున్నాయి. 8లో

వాతావరణం
గరిష్ఠం / కనిష్ఠం 31° / 15°
జిల్లా అంతటా మంగళవారం చలి ఎక్కువగానే ఉంటుంది. ఉదయం, రాత్రి మంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి విధుల్లోకి కలెక్టర్



ఖమ్మం సహకారనగర్: సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 17వ తేదీ వరకు వ్యక్తిగత సెలవులో వెళ్లిన కలెక్టర్ వీ.పీ. గౌతమ్ మంగళవారం విధుల్లో చేరనున్నారు. నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవంతో పాటు అదేరోజు ఖమ్మం నుంచే రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈమేరకు 18న సీఎం పర్యటన ఖరారు కావడంతో ఏర్పాట్లపై దృష్టి సారించేందుకు గాను కలెక్టర్ తన సెలవు రద్దు చేసుకున్నట్లు తెలిసింది.

స్వచ్ఛ గురుకులాలకు నగదు బహుమతులు



బహుమతులు అందచేస్తున్న అదనపు కలెక్టర్ స్నేహలత

ఖమ్మం సహకారనగర్: స్వచ్ఛ గురుకుల్ డ్రైవ్‌లో విజేతలుగా నిలిచిన గురుకులాలకు సోమవారం అదనపు కలెక్టర్ స్నేహలత నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబర్ మొదటి వారంలో స్వచ్ఛ గురుకుల్ డ్రైవ్ వారోత్సవాలు నిర్వహించగా, ఇందులో చురుకుగా పాల్గొని స్వచ్ఛ గురుకులాలుగా తీర్చిదిద్దిన వారికి బహుమతులు ప్రకటించినట్లు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.20 వేలను అడవిమల్లెల టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, జూనియర్ కళాశాల, రెండో బహుమతిగా రూ. 15 వేలను ఖమ్మం ఎన్నెస్పీ క్యాంపులోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కళాశాల, మూడో బహుమతిగా రూ.10 వేలను దానవాయిగూడెం టీఎస్ డబ్ల్యూఆర్‌ఎస్, జూనియర్ కళాశాల గెల్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఓ కె. ప్రత్యూష, ప్రిన్సిపాళ్లు ఎం.రాజ్యలక్ష్మి, సీహెచ్.జ్యోతి, ఆర్.నిరుపమ తదితరులు పాల్గొన్నారు.

18 నుండి సదరమ్ క్యాంపులు

ఖమ్మం వైద్యవిభాగం: దివ్యాంగులకు సదరమ్ సర్టిఫికెట్లు జారీ చేసేందుకు ఈనెల 18నుండి క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులు ఏదైనా మీ సేవ సెంటర్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. అనంతరం స్లాట్ రశీదు, ఆధార్ కార్డ్ జిరాక్స్, ఒక ఫొటో, మెడికల్ రిపోర్టుతో హాజరుకావాలని తెలిపారు. ఈనెల 18, 24, 31, ఫిబ్రవరి 7, 14, 21, 28, మార్చి 7, 14, 21, 28వ తేదీల్లో సదరమ్ శిబిరాలు ఉంటాయని ఆయన వివరించారు.

విద్యార్థుల్లో మనోధైర్యాన్ని పెంచాలి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల్లో మనోధైర్యాన్ని పెంచేందుకు వైద్యుల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు సూచించారు. వార్షిక పరీక్షలు మార్చిలో జరగనున్నందున విద్యార్థుల్లో భయం పోగొట్టేందుకు కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా తల్లిదండ్రులు కూడా జాగ్రత్త వహించాలని ఆయన ఓ ప్రకటనలో సూచించారు.

43మంది కానిస్టేబుళ్లకు ఉద్యోగోన్నతి

ఖమ్మంక్రైం: భద్రాద్రి-4జోన్ పరిధిలోని 43మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి లభించింది. ఈమేరకు డీఐజీ రంగనాథ్ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ జిల్లాల కానిస్టేబుళ్లు ఉండగా, ఎంతోకాలం తర్వాత ఉద్యోగోన్నతి లభించడంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కలెక్టరేట్‌లో నాటుతున్న మొక్కలు, గ్రీన్ గ్రాసరీ పనులు

పచ్చదనం ఉట్టిపడేలా...
నిర్మాణ సామగ్రి తీసుకొచ్చే వాహనాలేవీ లేకపోవడంతో కార్యాలయ ఆవరణలో పచ్చదనం ఉట్టి పడేలా మొక్కలు, గడ్డి నాటడం మొదలైంది. వివిధ ప్రాంతాల నుంచి తెప్పించిన మొక్కలను ఇప్పటికే నాటగా, గ్రీన్ గ్రాసరీ పరుస్తున్నారు. మరోవైపు కలెక్టరేట్ ఆవరణలోనే పల్లెప్రకృతి వనం ఏర్పాటుకు నిర్ణయించగా, అదనపు కలెక్టర్ స్నేహలత, డీఆర్డీఓ విద్యాచందన, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ పద్మయ్యనాయుడు, ఈసీ దీపక్, కార్యదర్శి ఉపేందర్ పర్యవేక్షించారు. కలెక్టరేట్ ప్రారంభానికి పది రోజులే మిగిలి ఉండడం, అందులో సంక్రాంతి పండుగ రెండు రోజులు కావడంతో మిగిలిన సమయంలో పనులన్నీ పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

మిగులు పనుల్లో వేగం!

- **కలెక్టరేట్ ప్రారంభ తేదీ ఖరారుతో ప్రత్యేక దృష్టి**
- ఇప్పటికే చివరి దశకు చేరిన పనులు
- గార్డెనింగ్, సౌకర్యాల కల్పనపై నజర్

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో నిర్మిస్తున్న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(నూతన కలెక్టరేట్) చివరి దశకు చేరింది. గార్డెనింగ్, కార్యాలయ గదుల్లో సౌకర్యాల కల్పన పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇంతలోనే ఈనెల 18న కలెక్టరేట్‌ను సీఎం కేసీఆర్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించడంతో వివిధ శాఖల అధికారులు సోమవారం ఉదయమే కలెక్టరేట్‌కు చేరుకున్నారు. మిగిలిన చిన్నచిన్న పనులను త్వరగా పూర్తిచేయించడంపై చర్చించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అన్ని పనులు చివరలో...
కలెక్టరేట్ నిర్మాణంలో ఇప్పటికే ప్రధాన పనులన్నీ పూర్తయ్యాయి. నిర్మాణ పనులన్నీ పూర్తికాగా, గార్డెనింగ్, తాగునీరు, విద్యుత్ పరికరాల బిగింపు పనులు కూడా చివరి దశలో ఉన్నాయి. చివరి కోటింగ్ రంగులు వేస్తుండగా, తలుపులు, కిటికీలకు తలుపుల ఏర్పాటు, విద్యుత్ లైన్లు అమర్చే పనులు జరుగుతున్నాయి. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తరచుగా తనిఖీ చేస్తుండగా, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యాంప్రసాద్, డీఈ చంద్రశేఖర్, ఏఈ విశ్వనాథం పర్యవేక్షణలో పనులు చేయిస్తున్నారు. మరోవైపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు, ఏసీల బిగింపు పనులు కూడా ఓ కొలిక్కి వచ్చాయి.



ముస్తాబైన కలెక్టర్ చాంబర్



పల్లె ప్రకృతివనంపై సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ స్నేహలత, అధికారులు



బోర్డు సరిచేస్తున్న కార్మికుడు

థ్యాంక్యూ సార్ !

- జీఆర్‌ఎస్ తొలివేదికగా ఖమ్మంను ఎంచుకోవడంపై హర్షం
- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి పువ్వాడ, నేతలు



సీఎం కేసీఆర్‌తో మంత్రి పువ్వాడ

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: టీఆర్‌ఎస్ బీఆర్‌ఎస్‌గా మారాక ఆవిర్భావ తొలిసభను ఖమ్మంలో నిర్వహించాలని పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈనెల 18న కలెక్టరేట్‌ను ప్రారంభించడమే కాక అదేరోజు బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభ నిర్వహించనున్నట్లు ఆదివారం సాయంత్రం ప్రకటించారు. దీంతో కలెక్టరేట్ సమీపాన ఎంపిక చేసిన స్థలంలో ఏర్పాట్లు సోమవారం మొదలయ్యాయి. ఈ సందర్భంగా తొలిసభ ఖమ్మంలో నిర్వహించాలని నిర్ణయించినందుకు జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్,, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితర కీలక నేతలు సోమవారం హైదరాబాద్ ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అధినేతతో సమావేశమైన జిల్లా నేతలు బహిరంగ సభను కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేసేందుకు చేయనున్న ఏర్పాట్లను వివరించగా... కేసీఆర్ సైతం జన సమీకరణ తదితర అంశాలపై సూచనలు చేశారు. సీఎంను కలిసిన వారిలో మంత్రి పువ్వాడతో పాటు ఎంపీ నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, విప్ రేగా కాంతారావు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోతు హరిప్రియ ఉన్నారు.

రెండో విడత కంటివెలుగుకు ఖమ్మంలోనే శ్రీకారం

- ముగ్గురు సీఎంల చేతుల మీదుగా రెండో దశ
- ఏర్పాట్లుచేస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ

ఖమ్మం వైద్యవిభాగం: కంటి వెలుగు రెండోదశ కార్యక్రమాన్ని ఖమ్మం నుంచి లాంఛనంగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ప్రపంచంలోనే అతిపెద్ద నేత్రపరీక్ష కార్యక్రమాన్ని మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే ఈనెల 18న ఖమ్మంలో కలెక్టరేట్‌ను ప్రారంభించాక రెండో విడత కంటివెలుగు కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం నిర్వహించిన తొలి విడత కంటివెలుగు కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.54 కోట్ల మందికి పరీక్షలు నిర్వహించి 50 లక్షల మందికి అద్దాలు పంపిణీ చేశారు. ఈసారి కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతీఒక్కరికీ పరీక్షలు నిర్వహించి, సుమారు 60లక్షల కళ్లద్దాలు అందించాలని నిర్ణయించినట్లు సమాచారం.

కొత్త కలెక్టరేట్‌లో ప్రారంభం
ఖమ్మంలో నిర్మించిన కొత్త కలెక్టరేట్ ప్రారంభ సమావేశానికి హాజరుకానున్న సీఎం కేసీఆర్ అదే రోజు కంటి వెలుగు రెండో దశ కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. అదేరోజు జరిగే బహిరంగ సభకు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. ఈమేరకు కొత్త కలెక్టరేట్ భవనంలోనే కంటి వెలుగును ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం సోమవారం వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నూతన కలెక్టరేట్‌ను పరిశీలించారు.

ఫిర్యాదులు పరిష్కరించండి

ప్రజావాణిలో అదనపు కలెక్టర్ స్నేహలత



వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ఖమ్మం సహకారనగర్: ప్రజలు ఇచ్చిన ప్రతీ ఫిర్యాదును పరిశీలించి సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్నేహలత ఆదేశించారు. జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి(గ్రీవెన్స్‌డే)లో భాగంగా ఆమె ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమై మాట్లాడుతూ గ్రీవెన్స్ దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఆర్వో శిరీష, ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- సింగరేణి నిధుల నుంచి మంజూరైన చెక్‌డ్యాంల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ఇప్పించాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య విన్నవించారు.
- జిల్లాలోని చివరి ఆయకట్టుకు సాగర్ జలాలు అందడం లేదని, వైరా రిజర్వాయర్ ఆయకట్టు నీటి సరఫరాపై స్పష్టత ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం నాయకుడు బొంతు రాంబాబు తదితరులు కోరారు.
- ముదిగొండ మండలం ముత్తారానికి చెందిన పలువురు గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి సంబంధించి సర్వే నంబర్లు 293, 294, 295, 296, 297ల్లోని భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు.
- విద్యావలంటీర్లు విధులు నిర్వర్తించిన తమకు నాలుగు నెలల పెండింగ్ వేతనం ఇప్పించాలని ఏన్కూరు మండలానికి చెందిన నాగేశ్వరరావు, సుజాత, రచన, రమాదేవి, లక్ష్మి, అరుణ తదితరులు కోరారు.

కమలం.. కుస్తీ!



బీజేపీ జిల్లా కార్యాలయం

- ఉమ్మడి జిల్లాలో పట్టు కోసం బీజేపీ యత్నాలు
- బూత్ లెవల్ కమిటీల నియామకంపై దృష్టి
- ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జిగా కేంద్ర మంత్రి బీఎల్.వర్మ
- నేడు వైరా సమావేశంలో పాల్గొననున్న మంత్రి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లాలో పట్టు సాధించేందుకు గాను భారతీయ జనతా పార్టీ(బీజేపీ) పాట్లు పడుతోంది. గత పరిస్థితులను బేరీజు వేసుకుంటూ సంస్థాగత నిర్మాణం, సమస్యల పరిష్కారమే అజెండాగా పార్టీ బలోపేతంపై దృష్టి సారించింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రధానంగా పోలింగ్ బూత్ కమిటీల ఏర్పాటుపై దృష్టి పెడ్డగా, ఇటీవల నియోజకవర్గాల వ్యాప్తంగా పార్టీ నాయకత్వం సమావేశాలు నిర్వహిస్తోంది. అంతేకాకుండా ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జిగా కేంద్ర మంత్రి బీఎల్.వర్మను నియమించింది. ఇప్పటికే ఆయన ఓసారి జిల్లాలో పర్యటించారు. రెండోసారి మంగళవారం పర్యటన షెడ్యూల్ ఖరారైంది.

ప్రతికూల రాజకీయమే..
జిల్లా రాజకీయ చరిత్రలో ఏ ఎన్నికలను చూసినా బీజేపీ పాత్ర నామమాత్రమే. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడా ఆ పార్టీకి బలమైన పునాదులు లేకపోగా, ఉన్న నాయకత్వం, కేడర్‌తోనే నెట్టుకొస్తున్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీతో పొత్తు పెట్టుకున్న ఆ పార్టీ పినపాక నియోజకవర్గంలో పోటీ చేసినా ఓటమి పాలైంది. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థికి మెజార్టీ ఓట్లు పోలయ్యాయి. ఆతర్వాత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేసినా ఎక్కడా డిపాజిట్ దక్కలేదు. ఆతర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్కడక్కడ బరిలో ఉన్నా ప్రభావం చూపలేకపోయింది. ఖమ్మం కార్పొరేషన్‌లో మాత్రమే ఒక కార్పొరేటర్ విజయంతో బోణీ కొట్టింది. ఇలా ఉమ్మడి జిల్లా రాజకీయ చరిత్రలో బీజేపీ ఎప్పుడు చూసినా నామమాత్రంగానే ఉంది. ప్రస్తుతం రాజకీయ పరిణామాల నేపథ్యాన ముఖ్య నేతలు, కేంద్ర మంత్రుల పర్యటనతో ఉన్న కేడర్‌ను కార్యోన్ముఖులు చేయడంతోపాటు నూతన జవసత్వాలపై ఆపార్టీ నజర్ పెట్టినట్లు తెలుస్తోంది.

ప్రతీ బూత్‌కి 22 మంది.
వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ రెండు కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తోంది. ప్రతీ పోలింగ్ బూత్ కమిటీ నియామకం, సమస్యలపై పోరాటం .. ఈ రెండు అంశాలను అజెండాగా చేసుకొని ముందుకెళ్తోంది. ఒక్కో బూత్‌కు 22 మంది సభ్యులను నియమించి, కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించేలా దిశానిర్దేశం చేస్తున్నారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం ఒకటైతే, పార్టీ అభ్యర్థులను విజయతీరానికి చేర్చడంలో ఈ కమిటీలు కీలకమనే భావనలో ఆపార్టీ నాయకత్వం ఉంది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 75 శాతం పోలింగ్ బుత్ కమిటీల నియామకం పూర్తయినట్లు చెబుతున్నారు. వీరే కాక ప్రతీ నియోజకవర్గానికి నలుగురు సారథ్యంలో ఎన్నికలకు వెళ్లేలా కార్యాచరణ రూపొందించారు. నియోజకవర్గ కమిటీలో స్థానిక నేతకు అసెంబ్లీ కన్వీనర్ బాధ్యతలు అప్పగించారు. అలాగే అసెంబ్లీ ఇన్‌చార్జి, సమన్వయకర్త, ఒక హోల్‌టైమర్ నియమించారు. నియోజకవర్గ కమిటీలోని నలుగురిలో స్థానిక నేత ఒకరు కాగా మిగిలిన ముగ్గురు ఇతర ప్రాంతాలకు చెందిన సీనియర్ నేతలను నియమించారు. ఇలా పోలింగ్ బూత్ కమిటీ, నియోజకవర్గ కమిటీల సమన్వయంతో నడిస్తే పార్టీ బలోపేతంతో పాటు ఎన్నికల సమరానికి సన్నద్ధమయ్యే ప్రక్రియ కూడా సునాయాసం అవుతుందన్నది ఆపార్టీ నేతల ఆలోచన.

బీఎల్.వర్మనే ఎన్నికల ఇన్‌చార్జి
రాష్ట్రంలో ప్రతీ పార్లమెంట్‌కు పార్టీ పరమైన ఇన్‌చార్జిగా బీజేపీ కేంద్ర మంత్రులకు బాధ్యతలు అప్పగించింది. ఖమ్మం పార్లమెంట్ బాధ్యతలను కేంద్ర మంత్రి బీఎల్.వర్మకు అప్పగించారు. ఆయన నియామకం తర్వాత రెండు నెలల క్రితం జిల్లాకు వచ్చి పార్టీ నేతలతో సమీక్షించారు. ఈక్రమంలో జిల్లాలో మంగళవారం ఆయన పర్యటన షెడ్యూల్ విడులైంది. ఉదయం 11.30 గంటలకు ఖమ్మంలోని ఎన్నెస్పీ అతిథిగృహానికి చేరుకుంటారు. ఆతర్వాత కలెక్టరేట్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై సంబంధిత అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం ప్రెస్‌మీట్‌లో మాట్లాడనున్నారు. మధ్యాహ్నం 2గంటలకు బోనకల్‌లోని బీసీ హాస్టల్‌ను సందర్శిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు వైరాలో నిర్వహించే పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరు కాకవడమే కాక, తల్లాడ, సత్తుపల్లిలో రైతులతో మాట్లాడి ఖమ్మం మీదుగా హైదరాబాద్ వెళ్లి అక్కడి నుంచి ఢిల్లీ బయలుదేరతారు.



కేంద్ర మంత్రి బీ.ఎల్.వర్మ

నిరభ్యంతర పత్రాలు ఇస్తాం

ఐటీడీఏ పీఓ హామీ



పీఓకు సమస్యలు వివరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉన్నత విద్యాభ్యాసం కోసం కోరిన చోటకు వెళ్లేలా నిరంభ్యంతర పత్రాలు ఇస్తామని ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు తెలిపారు. సోమవారం ఆయన్ను ఐటీడీఏలో ఉపాధ్యాయులు, టీపీటీఎఫ్ నాయకులు కలిసి సమస్యలు వివరించారు. దీంతో స్పందించిన పీఓ పత్రాలను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రాజు, జి.హరిలాల్, మునిగడప రామాచారి తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వకపోతే మళ్లీ సమ్మె

- ఎస్టీ డీడీ హామీతో ఆందోళన విరమించిన ఔట్‌సోర్సింగ్ వర్కర్లు
- ఉదయం నుంచే కార్మికులను అడ్డుకోవడంతో విద్యార్థుల ఇక్కట్లు



సమ్మె విరమణపై చర్చలు జరుపుతున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలంటూ గిరిజన కళాశాల వసతి గృహాల్లోని ఔట్‌సోర్సింగ్ వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు వర్కర్లు, సీఐటీయూ నాయకులు వెల్లడించారు. నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం తెల్లవారుజామున ఐదు గంటలకే ఔట్‌సోర్సింగ్ వర్కర్లు జిల్లాలోని గిరిజన కళాశాల వసతిగృహాల వద్దకు చేరుకొని పనిచేసేందుకు వచ్చిన రోజువారీ కార్మికులను అడ్డుకున్నారు. దీంతో ఎలాంటి పనులు జరగక విద్యార్థులకు అల్పాహారం, టీ కూడా అందలేదు. ఈ విషయమై సమాచారం అందుకున్న ఎస్టీ డీడీ కృష్ణనాయక్, అధికారులు నగరంలోని ఎస్‌ఎస్‌పీ క్యాంపు మహిళా కళాశాల వసతిగృహం వద్దకు చేరుకుని సీఐటీయూ నాయకులు, వర్కర్లతో చర్చించారు. పది రోజుల్లోగా వేతనాల మంజూరుకు చర్యలు తీసుకుంటామని, పండుగ సమయాన ఖర్చుల కోసం ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఇచ్చి, వేతనాలు వచ్చాక రికవరీ చేసుకుంటారని హామీ ఇచ్చారు. దీంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి, వేతనాలు రాకుంటే ఈనెల 20వ తేదీ నుండి మరోసారి సమ్మెకు దిగుతామని ప్రకటించారు.

మభ్యపెట్టొద్దు...
మూడేళ్లుగా రావాల్సిన వేతనాల బకాయిలు చెల్లించకపోతే సంక్రాంతి పండుగ తర్వాత మళ్లీ నిరవధిక సమ్మెకు దిగుతామని సీఐటీయూ నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్ తెలిపారు. ఒక నెల జీతం రాకపోతేనే తీవ్రంగా ఇబ్బంది పడే ఈరోజుల్లో మూడేళ్ల జీతాలు ఇవ్వకపోతే కార్మికుల పరిస్థితి ఏమిటో అధికారులు ఆలోచించాలని కోరారు. చెక్ విడుదలైందని మభ్యపెడుతూ కార్మికులను మోసం చేస్తున్నారని... వెంటనే బకాయిలు విడుదల చేయకపోతే పండుగ అనంతరం మళ్లీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్మికులు బోడపట్ల సుదర్శన్, కాంపాటి వెంకన్న, బాదావత్ లక్కా, మల్లికార్జున్, జె.వెంకన్న బాబు, ప్రవీణ్, పి.వాసు, సంతోష్, లక్ష్మీదేవి, వీరమ్మ, మోహన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు సమ్మెకు మద్దతు తెలిపారు.

ఇబ్బంది పడిన విద్యార్థులు
గిరిజన కళాశాల వసతి గృహాల్లోని ఔట్‌సోర్సింగ్ వర్కర్లు సమ్మెకు దిగడంతో అధికారులు రోజువారీ కార్మికులతో పనిచేయిస్తున్నారు. అయితే, సోమవారం వసతిగృహాల్లోకి వారు రాకుండా అడ్డుకున్నారు. కొందరు బలవంతంగా లోపలకు వెళ్లినా వంట చేయనివ్వదు. ఫలితంగా గిరిజన కళాశాల వసతిగృహాల్లోని విద్యార్థులకు అల్పాహారం, రాగిజావ, టీ అందకపోగా.. డిగ్రీ విద్యార్థులు ఖాళీ కడుపులతోనే పరీక్షలకు వెళ్లారు. ఇక ఇంటర్ విద్యార్థులు, ఇతర విద్యార్థులకు అదే పరిస్థితి ఎదురు కాగా, అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు.

వైభవంగా 'దొంగల దోపు'

- విశ్రాంతి మండపంలో రామయ్యకు రాపత్తు సేవ



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారికి దొంగల దోపు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్కి అవతారంలో ఉన్న స్వామివారికి ఎదురుగా జరిగిన ఈ వేడుకలో ఆలయ సిబ్బంది ఆసక్తికరంగా నటించారు. పరకాలుడి వేషం ధరించిన వ్యక్తి శంఖుచక్రాలు, గొడుగు దొంగతనం చేయగా భటుల వేషధారులైన వారు అతడిని పట్టుకుని స్వామివారికి అప్పచెబుతారు. నిందితులు తమ తప్పును అంగీకరించి స్వామి వారిని క్షమించమని అడుగగా మన్నిస్తారు. దీన్ని దృశ్య రూపంలో అభినయించిన ఆలయ సిబ్బందిని పలువురు అభినందించారు.

స్వామివరాకి రాపత్తు సేవ..
స్థానిక రాజవీధిలో ఉన్న విశ్రాంత మండపంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారికి రాపత్తు సేవ ఘనంగా జరిపారు. తొలుత మేళతాళాలు, కోలాటాల నడుమ పల్లకీలో స్వామివారిని మండపం వద్దకు తీసుకొచ్చి వేంచేపు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు, పండితులు ప్రత్యేక పూజలు చేసి హారతి సమర్పించారు. భక్తులు స్వామివారికి ఘనంగా స్వాగతం పలికారు.

క్లుప్తంగా

రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్‌గా రవీందర్‌రావు


రవీందర్‌రావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్‌గా రిటైర్డ్ తహసీల్దార్ ఆర్.రవీందర్‌రావు నియమితులయ్యారు. సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయనతో పాటు మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులుగా కొత్త సత్యనారాయణరెడ్డి, మూలగుండ్ల శ్రీహరి, బి.వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. వీరిని చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్, సభ్యులు డాక్టర్ విజయలక్ష్మి అభినందించారు.

సాంఘిక సంక్షేమ గురుకులానికి అవార్డు


అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్

కారేపల్లి: కారేపల్లిలో కొనసాగుతున్న ఇల్లెందు సాంఘిక సంక్షేమ గురుకులం స్వచ్ఛ గురుకుల్ అవార్డుకు ఎంపికైంది. గత ఏడాది సెప్టెంబర్ 5నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన పోటీల్లో గురుకులం ప్రథమస్థానంలో నిలవగా భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ డి.అనుదీప్ రూ.20వేల నగదు బహుమతిని ప్రిన్సిపాల్ కందుల లిల్లీకి అందజేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను ప్రిన్సిపాల అభినందించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


సతీష్ (ఫైల్)

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కోట సతీష్(28) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మండలంలోని రేమిడిచర్లకు చెందిన వ్యక్తి ఎర్రుపాలెంలో నిర్మిస్తున్న ఇంట్లో సతీష్ సోమవారం సీలింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తాకాయి. దీంతో షాక్‌కు గురైన ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డుప్రమాదంలో 'రియల్' వ్యాపారి..


ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బూడిదంపాడుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సింగి ప్రవీణ్‌కుమార్(27) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... ఖమ్మం నుండి బూడిదంపాడులోని ఇంటికి వెళ్తున్న ప్రవీణ్‌కుమార్‌ను మంచుకొండ సమీపాన ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఘటనాస్థలంలో రక్తమరకలపై లారీ టైర్ల గుర్తులు ఉండడంతో ప్రమాదానికి లారీ కారణమని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ప్రవీణ్ తలభాగం ఛిద్రమై మృతి చెందగా, తన ద్విచక్ర వాహనం స్కిడ్ అయి కిందపడడంతో ఎదురుగా వచ్చిన లారీ ఎక్కిందా, లేక వాహనం తగలడంతోనే ప్రమాదం జరిగిందా అనేది విచారిస్తున్నామని ఎస్‌ఐ రవి తెలిపారు. ఈమేరకు మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రవీణ్ ఇంకా వివాహం కాకపోగా, తల్లిదండ్రులు, ఇద్దరు సోదరులు, ఒక సోదరి ఉన్నారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

నేలకొండపల్లి: బోనకల్ మండలంలోని జానకీపురానికి చెందిన డిగ్రీ విద్యార్థి ఇంటి నుంచి కానరాకుండా వెళ్లిపోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. జానకీపురానికి చెందిన విద్యార్థిని ఖమ్మంలోని ప్రైవేట్ డిగ్రీ కాలేజీలో చదువుతూ నేలకొండపల్లి మండలం రాయగూడెంలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. ఈనెల 4న కాలేజీకి వెళ్లి తిరిగి రాకపోగా, ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆమె తల్లి ఫిర్యాదు మేరకు నేలకొండపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

కోడిపందేల స్థావరంపై దాడి

పెనుబల్లి: మండలంలోని మర్లకుంట శివారు పొలాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో వీఎం బంజర్ ఎస్సై జి.సూరజ్ ఆధ్వర్యాన సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా పందేలు నిర్వహిస్తున్న ఎన్టీఆర్ జిల్లా గాజుపేటకు చెందిన పలువురు పట్టుబడ్డారు. వీరి నుంచి రెండు కోడి పుంజులు, కోడి కత్తులు, రూ.10,100 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మిర్చి కొత్తవి	20,800	13,600
నిల్వమిర్చి	20,000	13,000
మిర్చి తాలు	10,600	7,000
పత్తి	8,450	7,000

– ఖమ్మం వ్యవసాయం

మహా ప్రసాదం

- భద్రాచలం, పర్ణశాలలో భక్తులకు సకల వసతులు
- ప్రసాద్ పథకంలో రూ.41 కోట్లు విడుదల చేసిన కేంద్ర టూరిజం శాఖ
- వేగం పుంజుకోనున్న అభివృద్ధి పనులు


భద్రాచలం పట్టణ ప్రవేశంలో ఉన్న ఐదు ఎకరాల ఆర్‌అండ్‌బీ స్థలంలో భక్తుల వసతి కోసం నిర్మించనున్న భవనాల నమూనా చిత్రం

భద్రాచలం: భక్తులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రామాలయ అభివృద్ధికి తొలి అడుగులు పడ్డాయి. కేంద్ర ప్రభుత్వం, పర్యాటక మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో 'పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిర్చువల్ అగ్మెంటేషన్ డ్రైవ్(ప్రసాద్)' పథకంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు గత నెల 28న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సుమారు రూ.41 కోట్ల విలువైన పనులు భద్రాచలం, పర్ణశాల దేవస్థానాల పరిధిలో జరగనున్నాయి. పనుల ప్రారంభానికి టూరిజం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కేంద్ర టూరిజం శాఖ నుంచి రూ.41 కోట్లు విడుదల చేస్తూ జీఓ కూడా జారీ అయింది. దీంతో చేపట్టనున్న పనులకు సంబంధించిన క్లియరెన్స్, అంచనాలు, టెండర్ల ఖరారుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వీటన్నింటినీ పూర్తి చేసి త్వరలోనే అభివృద్ధి పనులను పట్టాలెక్కించనున్నారు.

భక్తులు అబ్బురపడేలా..

భద్రాచలం, పర్ణశాల దేవస్థానాల పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి టూరిజం అధికారులు పలుమార్లు ఆలయాలను పరిశీలించి తొలుత రూ.92.04 కోట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే గత నెల 28న భద్రాద్రి రామయ్య దర్శనానికి రాష్ట్రపతి పర్యటన ఖరారు కాగానే ఈ అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.41,38,07,970 నిధులను మంజూరు చేసింది. ఇందులో రామాలయం, ఉపాలయాలు, మిథిలా స్టేడియం, ప్రసాదం తయారీ కేంద్రంలతో పాటు పలుచోట్ల అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించారు. ప్రధానంగా రామాలయంలో నిత్యకల్యాణం రూఫింగ్‌కు రూ.1.09 కోట్లు, హనుమాన్ టెంపుల్ వద్ద రూఫింగ్‌కు రూ.1.92 కోట్లు, మిథిలా స్టేడియంలో డిటాచబుల్ రూఫ్‌నకు రూ.1.69 కోట్లు, వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం లిఫ్ట్‌కు రూ.47 లక్షలు, భక్తుల లిఫ్ట్‌ల సివిల్ పనులకు రూ.21 లక్షలు కేటాయించారు. అదేవిధంగా నిత్యకల్యాణ మండపంలో రూ.47 లక్షలు, హనుమాన్ టెంపుల్ ఏరియాలో రూ.40 లక్షలతో ఫ్లోరింగ్ పనులు చేపట్టనున్నారు. మెట్ల మార్గం, క్యూలైన్లలో రెయిలింగ్‌కు రూ.10 లక్షలు, ప్రసాదాల తయారీ విభాగాన్ని పెంచడం, ఆధునికీకరణకు, మిషనరీల కొనుగోలుకు రూ.70 లక్షలు అవసరమని ప్రతిపాదనలు చేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో, హరిత హోటల్ రోడ్డు నుంచి ఆలయం


గత నెల 28న ప్రసాద్ పనులకు శంకుస్థాపన చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము(ఫైల్)

వరకు ఇరువైపులా షెల్టర్లు, బెంచీలు, సెంట్రల్ లైటింగ్ సిస్టంల కోసం రూ. 95 లక్షలు, గోదావరి ఒడ్డున ఘాట్ ఏరియాలో భక్తులు దుస్తులు మార్చుకునే గదులు, బయో టాయ్‌లెట్స్, జెట్టీల ఏర్పాటుకు రూ.1.34 కోట్లు కేటాయించారు. పట్టణ ప్రవేశంలో రూ.74 లక్షలతో స్వాగత ద్వారం, రెండెకరాల స్థలంలో యాత్రికుల సౌకర్యార్థం గదులు, వ్రత మండపాలకు రూ.10 కోట్లు, ఐదెకరాల స్థలంలో క్యాంటీన్, వాష్ రూంలు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.3.10 కోట్లు, అలాగే కాటేజీల నుంచి ఆలయం వరకు, మాడ వీధులలో భక్తుల కోసం బ్యాటరీ వాహనాలకు రూ.75 లక్షలు, భక్తులకు స్వాగతం పలికేలా రూ.2.43 కోట్లతో స్టోన్ స్వాగత ద్వారం ఏర్పాటు చేయనున్నారు.

పర్ణశాల ఆలయానికి మహర్దశ..

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి పర్ణశాల రామాలయం అనుబంధంగా ఉంది. భద్రాచలం వచ్చిన భక్తులంతా పర్ణశాల క్షేత్రాన్ని దర్శించుకుంటారు. ఇంతటి ప్రాశస్త్యం గల ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేయడంలో రామాలయ అధికారులు నిర్లక్ష్యం వహించారు. ప్రసాద్ పథకంలో మాత్రం కేంద్ర ప్రభుత్వం పర్ణశాల అభివృద్ధికి తగిన చోటు కల్పించింది. సుమారు రూ.10 కోట్లు అభివృద్ధి పనులకు కేటాయించనున్నారు. పర్ణశాల, సీతమ్మ వాగు వద్ద భక్తుల విడిది కోసం రూ.4 కోట్లతో భవనం, వెయిటింగ్ హాలు, స్థానిక వ్యాపారుల దుకాణాలు, క్యాంటీన్లు, సెంట్రల్ లైటింగ్, బయో టాయ్‌లెట్స్, క్యూలైన్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రెయిన్ షెల్టర్స్ తదితర పనుల కోసం రూ.4.92 కోట్లు కేటాయించారు. ఇక భద్రాచలం, పర్ణశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. కోటి వెచ్చించనున్నారు.

కేసీఆర్ దృష్టి పెడితే మరింత అభివృద్ధి..

భద్రాచలం దేవస్థానం, పట్టణ ప్రజలపై తెలంగాణ సీఎం కేసీఆర్ దృష్టి పెడితే మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని భక్తులు అంటున్నారు. 2014లో సీఎం హోదాలో శ్రీరామనవమికి పట్టువస్త్రాలు, ముత్యాలను తీసుకొచ్చిన సీఎం కేసీఆర్.. అభివృద్ధి పనులకు రూ.100 కోట్లు ఇస్తామని ప్రకటించారు. ఆ తర్వాత రాష్ట్ర బడ్జెట్‌లో పలుమార్లు నిధులను కేటాయించినా మంజూరు మాత్రం కాలేదు. ఇంతలోనే కేంద్ర ప్రభుత్వం టూరిజం శాఖ నుంచి రూ.41 కోట్లు ప్రసాద్ పథకం కింద మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 12న కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి కేసీఆర్ రానున్న నేపథ్యంలో మళ్లీ భక్తుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇచ్చిన మాట ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి దీటుగా రూ.100 కోట్లు విడుదల చేస్తే భద్రాచలం అభివృద్ధికి ఇక అడ్డే ఉండదని పలువురు అంటున్నారు. యాదాద్రి ఆలయ నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో ఇప్పటికైనా భద్రాద్రి రామయ్య వైపు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

కూతురు సహా తల్లి ఆత్మహత్య

- మున్నేరు వాగులో దూకి బలవన్మరణం
- కుటుంబ కలహాలే కారణమని అనుమానం


ఉమారాణి, యశశ్రీ వైవిజ్ఞ (ఫైల్)

ఖమ్మం క్రైం: కుటుంబ కలహాలో మరో కారణమో తెలియదు కానీ అభంశుభం ఎరగని చిన్నారి సహా వాగులో దూకి వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన ఖమ్మంలో చోటు చేసుకోగా, పోలీసులు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. కొణిజర్ల మండలం తనికెళ్లకు చెందిన ఉమారాణికి ఆరేళ్ల క్రితం నేలకొండపల్లి మండలం పైనంపల్లికి చెందిన తన మేనత్త కుమారుడు ఉడతల నాగరాజుతో వివాహమైంది. వీరికి కూతుళ్లు అరణ్య(4), యశశ్రీ వైవిజ్ఞ(1) ఉన్నారు. నాగరాజు వ్యవసాయం చేస్తుండగా, ఉమారాణికి ఆమెకు అత్తతో అప్పుడప్పుడూ గొడవలు జరుగుతున్నా, ఆ తర్వాత సర్దుకుపోతుంటారని తెలిసింది. ఈనేపథ్యాన ఆదివారం కూడా వీరిద్దరి మధ్య పాల విషయమై చిన్న గొడవ జరిగింది. దీంతో క్షణికావేశంలో పెద్దకూతురును పక్కింట్లో ఉంచిన ఉమారాణి చిన్నకుమార్తె వైవిజ్ఞను తీసుకుని ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ తెలియకపోగా తనికెళ్లలో ఆమె సోదరుడు ఉపేందర్‌ను అడిగినా అక్కడికి రాలేదని తెలిపాడు. అయితే పైనంపల్లికి చెందిన వీరి బంధువు, ఆటోడ్రైవర్‌కు ఉమారాణి బిడ్డతో కలిసి ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతాన ఆదివారం సాయంత్రం కనిపించడంతో ఆరా తీయగా తన సోదరుడి ఇంటికి వెళ్తున్నానని చెప్పింది. ఆతర్వాత ఆయన ఇంటికి వెళ్లేసరికి ఉమారాణి కోసం వెతుకుతున్నట్లు తెలియడంతో కాల్వొడ్డులో కనిపించిందని చెప్పగా వారు ఖమ్మం వచ్చి వెతికి త్రీ టౌన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలోనే సోమవారం సాయంత్రం పాప మృతదేహం మున్నేరు తేలడం, ఒడ్డున ఉమారాణి చెప్పులు ఉండటంతో ఆమె భర్త నాగరాజుకు ఫోన్ చేశారు. ఆయన వచ్చి పాప మృతదేహాన్ని గుర్తుపట్టడంతో సీఐ సర్వయ్య, ఎస్‌ఐ రఫీ చేరుకుని ఇచ్చిన సమాచారంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు పాప మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఇంతలోనే ఉమారాణి మృతదేహం కూడా తేలడంతో మార్చురీకి తరలించగా పైనంపల్లి, తనికెళ్ల నుంచి ఉమారాణి కుటుంబీకులు, బంధువులు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. దివ్యాంగురాలైన ఉమారాణి అందరితో కలిసిమెలిసి ఉండేదని బంధువులు చెబుతున్నారు. కాగా, ఉమారాణిని ఆదివారం సాయంత్రం మున్నేరు వద్ద గమనించిన ఓ పశువుల కాపరి ఆరా తీస్తే మున్నేరును చూడటానికి వచ్చినట్లు సమాచారం. ఆ తర్వాత ఎవరూ లేని సమయంలో ఆమె వాగులో దూకి ఉంటుందని భావిస్తున్నారు.

పలు కుటుంబాలకు మాజీ ఎంపీ పరామర్శ


సత్తుపల్లి రూరల్: నర్సింహులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పొంగులేటి

కల్లూరు రూరల్/సత్తుపల్లిరూరల్/తల్లాడ: జిల్లాల్లో కల్లూరు, సత్తుపల్లి, తల్లాడ మండలాల్లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కల్లూరు మండలం నారాయణపురంలో ఇటీవల మృతి చెందిన పొంగులేటి నరోత్తమరెడ్డి దశదిన కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటం వద్ద పొంగులేటి నివాళులర్పించారు. అలాగే, సత్తుపల్లి మండలం రామానగరానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ నీలాల నర్సింహారావు దశదినకర్మలో కూడా శ్రీనివాసరెడ్డి పాల్గొని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆతర్వాత తల్లాడ మండలం మల్లవరం, అంజనాపురం, తెలగవరం, నారాయణపురం, తల్లాడ గ్రామాల్లో పర్యటించి ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈకార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కొణిజర్ల ఎంపీపీ గోసు మధుతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కీసర వెంకటేశ్వరెడ్డి, జారే ఆదినారాయణ, ఒంటెద్దు సాయిలు, కొండా జయరాజు, ఎల్లమర్తి సత్యనారాయణ, నర్సింహారావు, ఎలమర్తి సత్యనారాయణ, బలగాని చంద్రశేఖర్, మట్టకోయ వెంకటేశ్వర్లు, అత్తిలి వెంకట్, కొత్తపల్లి అభిషేక్, దండు హుస్సేన్, దండు నాగేశ్వరరావు, కొనపాకుల దుర్గారావు, జల్లిపల్లి రమణయ్య, నీలాల అప్పన్న, గోపిశెట్టి వెంకటేశ్వర్లు, ఎర్రి నరసింహారావు, తాళ్ల జోసఫ్, గొడుగునూరి లక్ష్మీరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రెడ్డెం వీరనరసింహారెడ్డి, గణేశుల రవి, పోట్రు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులకు తావివ్వకండి

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు హేమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: మతోన్మాద శక్తులకు జిల్లాలో చోటు ఇవ్వొద్దని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా చైతన్యానికి ప్రతీకగానిలుస్తుండగా, ఏనాడు మతపరమైన ఘర్షణలు జరగలేదని తెలిపారు. ఈ సమయాన కొందరు విద్వేషాలతో పబ్బం గడుపుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మరోపక్క కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర తెలియని వారు అనవసర విమర్శలు చేయడం సరికాదని సూచించారు. ఈసమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌తో పాటు నాయకులు మేకల శ్రీనివాసరావు, శింగు నర్సింహారావు, కొండపర్తి గోవిందరావు, తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

23న జాతీయ స్థాయిలో చేతిరాత పోటీలు

ఖమ్మం సహకారనగర్: జాతీయస్థాయి చేతిరాత దినోత్సవం సందర్భంగా ఈనెల 23వ తేదీన ఆన్‌లైన్‌లో చేతిరాత పోటీలను నిర్వహిస్తున్నట్లు హ్యాండ్ రైటింగ్ అసోసియేషన్ – ఇండియా కార్యదర్శి షేక్ మహ్మద్ హుస్సేన్ తెలిపారు. అమ్మ ఒడి హ్యాండ్‌రైటింగ్ అండ్ క్యాలిగ్రఫీ ఇన్‌స్టిట్యూట్, ఆలిండియా గ్రాఫాలజీ అసోసియేషన్, హ్యాండ్‌రైటింగ్ ట్రైనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఒకటి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులే కాక ఉపాధ్యాయ శిక్షణార్థులు కూడా పాల్గొనవచ్చని తెలిపారు. పరీక్ష రాశాక వాట్సాప్‌కు పంపించాల్సి ఉంటుందని, వివరాలకు 86394 14376, 91822 00765 నంబర్లను సంప్రదించాలని ఆయన ఓ ప్రకటనలో సూచించారు.

'దళితబంధు'తో ఆర్థికంగా ఎదగాలి


మెడికల్ షాపును ప్రారంభిస్తున్న కొండబాల కోటేశ్వరరావు

చింతకాని: దళితబంధు పథకం ద్వారా మంజూరైన యూనిట్లను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు సూచించారు. మండలంలోని గాంధీనగర్‌కాలనీలో దళితబంధు లబ్ధిదారులు ఏర్పాటుచేసుకున్న మెడికల్ షాప్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. దళితుల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారని, సీఎం ఆలోచనకు అనుగుణంగా ఆర్థికాభివృద్ధి సాధించాలని తెలిపారు. కాగా, మండలంలోని తిమ్మినేనిపాలెంలో ఇటీవల మృతి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఆళ్ల వెంకటేశ్వర్లు కుటుంబాన్ని కోటేశ్వరరావు పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు కాలంగి లలిత, దమ్మాలపాటి శ్రీదేవి, జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్‌తో పాటు గురిజాల హన్మంతరావు, పెంట్యాల పుల్లయ్య, కాలంగి చలమయ్య, వంకాయలపాటి లచ్చయ్య, పిన్నెల్లి శ్రీను, షేక్ ఖాసిం సాహెబ్, గోగుల శ్రీను, మంకెన రమేష్, దమ్మాలపాటి జగన్మోహన్‌రావు, షేక్ మదార్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనులు అడ్డగింత


పనులు జరగకుండా అడ్డుగా పడుకున్న మహిళ


స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దార్

ముత్యాలమ్మ తల్లి ఆలయం నిర్మిస్తేనే పనులు

నేలకొండపల్లి: జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా ముత్యాలమ్మ తల్లి ఆలయం కనుమరుగవుతున్నందున మరోచోట దేవాలయం కట్టే వరకు పనులు చేయనిచ్చేది లేదని స్థానికులు స్పష్టం చేశారు. ఈమేరకు మండలంలోని గువ్వలగూడెంలో సోమవారం జాతీయ రహదారి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4 గంటల వరకు ముత్యాలమ్మ దేవాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు వంగూరి ఆనందరావు మాట్లాడుతూ ఎస్సీలకు సంబంధించిన ముత్యాలమ్మ ఆలయం వద్ద ఏటా జాతర చేసుకుంటారని తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణంలో ఆలయాన్ని తొలగిస్తున్నందున, మరోచోట గుడి కట్టాకే రహదారి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రహదారి కాంట్రాక్టు ప్రతినిధులు సాయంత్రం ఫోన్‌లో స్థానికులతో చర్చించి తహసీల్దార్ కార్యాలయానికి రావాలని సూచించారు. దీంతో అక్కడకు వచ్చిన వారితో తహసీల్దార్ దారా ప్రసాద్ చర్చించగా గుడి నిర్మాణానికి రూ.5 లక్షలు చెల్లించాలని స్థానికులు డిమాండ్ చేయగా, ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.నర్సయ్యతో పాటు వెంకటేశం, పెద్ద బంగారు, వెంకటరమణ, కె.నాగమ్మ, వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

'గ్రీన్ ఇండియా చాలెంజ్'లో నేను సైతం


మొక్క నాటుతున్న దిలాన్ - ప్రియాంక దంపతులు

వైరా రూరల్: ఎంపీ జోగినిపల్లి సంతోష్‌కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో నేను సైతం అంటూ ఓ విదేశీయుడు మొక్క నాటాడు. వైరా మండలం పాలడుగుకు చెందిన ప్రియాంక ఆస్ట్రేలియాలో స్థిరపడగా, ఆ దేశానికే చెందిన దిలాన్‌ను వివాహం చేసుకుంది. వీరి వివాహ మహోత్సవం సందర్భంగా స్వగ్రామానికి రాగా పాలడుగులో సోమవారం దిలాన్ గ్రీన్ ఇండియా చాలెంజ్ స్వీకరించి మొక్కలు నాటారు. ఆస్ట్రేలియాలో కూడా మొక్కలు నాటేలా కార్యక్రమాన్ని కొనసాగిస్తానని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధానాస్పత్రి ఏఓ డాక్టర్ రాజశేఖర్, సృజన తదితరులు పాల్గొన్నారు.

మైనర్లతో పనిచేయిస్తున్న వారిపై కేసు

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్డులోని పలు షాపుల్లో మైనర్లతో పనిచేయిస్తున్న యజమానులపై కేసు నమోదైంది. స్థానిక లెప్రసీ కాలనీలోని స్టీల్ సిండికేట్ దుకాణంలో మైనర్ బాలుడిని పనిలో పెట్టుకున్న భాస్కర్‌రావు, పెదతండాలో బిల్డింగ్ నిర్మాణ పనుల్లో మైనర్‌తో పనిచేయిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన యజమాని సోను, హార్డ్‌వేర్ దుకాణంలో బాలుడిచే పని చేయిస్తున్నట్లు కార్మిక శాఖ సహాయ అధికారి చల్లా వెంగమాంబ సోమవారం గుర్తించారు. ఆమె ఇచ్చిన సమాచారంతో యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవూఫ్ తెలిపారు.

రూ.2 లక్షల విలువైన ఐరన్ చోరీ

నేలకొండపల్లి: కోదాడ–కురవి జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో ఉపయోగిస్తున్న ఐరన్ చోరీకి గురైంది. నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారం క్రాస్ వద్ద జరుగుతున్న జాతీయ రహదారి పనుల కోసం కాంట్రాక్టర్ ఐరన్ నిల్వచేశారు. ఇందులో సోమవారం రూ.2 లక్షల విలువైన ఐరన్ చోరీకి గురైంది. ముగ్గురు వ్యక్తులు ఆ ప్రాంతంలో తచ్చాడగా, వారే చోరీ చేసి ఉంటారనే అనుమానంతో కంపెనీ ప్రతినిధి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు నేలకొండపల్లి ఎస్సై జి.స్రవంతి తెలిపారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

జూలూరుపాడు: భద్రాద్రి జిల్లా సరిహద్దు గ్రామమైన వినోభానగర్‌లో జూలూరుపాడు పోలీసులు సోమవారం రాత్రి విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈనెల 12న రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పోలీసులు వినోభానగర్‌లో ప్రత్యేక చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. ఎస్సై పోటు గణేష్ సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు.

హరినాథరావుకు జిల్లా నేతల నివాళి


మంత్రి కేటీఆర్‌ను పరామర్శిస్తున్న మంత్రి పువ్వాడ, ఎమ్మెల్యే వెంకటవీరయ్య, మాజీ మంత్రి తుమ్మల

ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మంరూరల్/సత్తుపల్లి : రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ మామ పాకాల హరినాథరావు ఇటీవల మృతి చెందగా దశదినకర్మ హైదరాబాద్‌లో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో పాటు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరినాథరావు చిత్రపటం వద్ద నివాళులర్పించడంతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, మంత్రి కేటీఆర్‌ను పరామర్శించారు.